క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

దహెగాం: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం పుప్పాల మల్లక్క ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ముత్యంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్లాసులు, నోట్‌బుక్కులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ పుప్పాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్, సభ్యులు పుప్పాల లక్ష్మి నారాయణ, స్థానికులు సుంకరి బాపు, దెబ్బటి సత్యనారాయణ, తిరుపతి, ప్రదీప్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్‌స్కూల్ జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు మంగళవారం సిర్పూర్(యూ) మండలంలో నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు వివిధ మండలాల నుంచి అండర్ 14, 17 బాలబాలికల విభాగాల్లో మొత్తం 282 మంది పాల్గొనగా 60 మంది ఉమ్మడి జిల్లా, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జోనల్‌స్థాయి అండర్ 17 బాలబాలికలకు ఆదిలాబాద్‌లో, అండర్ 14 బాలురకు మంచిర్యాలలో, అండర్ 14 బాలికలకు నిర్మల్‌లో పోటీలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. క్రీడల అధికారి మీనరెడ్డి, మధుసూదన్, ప్రిన్సిపాల్ వెంకటస్వామి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి 'తెలంగాణ రత్న' అవార్డు

వాంకిడి: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అసోసియేషన్, అర్పిత స్వచ్ఛంద సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ పురస్కారాల ప్రధానోత్సవంలో మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నూతి అభిలాష్‌కు తెలంగాణ రత్న అవార్డు లభించింది.

ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల హాజరును ముఖ గుర్తింపు ద్వారా నమోదు చేయాలని ఎస్‌వో సుభాష్ అన్నారు. మంగళవారం మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం) ద్వారా ఫోన్‌లో హాజరు నమోదు చేసి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, యూఆర్ఎస్ గురుకుల పాఠశాలల్లో హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదు చేయాలన్నారు.

కెరమెరి: విద్యార్థులకు ఫేషియల్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి రాథోడ్ సుభాష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఝరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ హాజరు నమోదును పరిశీలించారు.

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామంలో భక్త ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి మంగళవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లెండుగురె శ్యాంరావు రూ. 5వేల విరాళాన్ని అందజేశారు. నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా వంజీరి, కోసిని గ్రామాల్లో మట్టి సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వంజీరిలోని భక్త ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అశోక్, సంజీవ్, గోపి, హన్మంతు, తిరుపతి, గురువయ్య, కాంతారావు, వెంకటేశ్, శ్యాంరావు, బాపు, రమేశ్ పాల్గొన్నారు.

లక్మాపూర్ వాగు కష్టాలు తీర్చాలి

కెరమెరి: మండలంలోని లక్మాపూర్ వాగు కష్టాలు తీర్చాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజ్మీరా శ్యామ్‌నాయక్ అన్నారు. మంగళవారం వాగు వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితమే వంతెన పూర్తికావాల్సి ఉన్నా అధికారులు, గుత్తేదారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే వంతెన పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాథోడ్ బలిరాం, రవీందర్, హరిరాం, మిలింద్ కుమార్ ఉన్నారు.

మెరుగైన ప్రాథమిక చికిత్స అందించాలి

కౌటాల: గ్రామీణ ప్రజలకు ఆర్‌ఎంపీలు మెరుగైన ప్రాథమిక చికిత్స అందించాలని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన భవనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఎంపీపీ విశ్వనాథ్, సర్పంచ్ మౌనిశ్, ఎంపీటీసీ మనీష్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, సంఘం మండలాధ్యక్షులు రాజేశ్వర్, నాయకులు మధుకర్, ప్రకాశ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సంతోష్, ఆర్‌ఎంపీలు కైలాసం, దిలీప్, సుకృజీ, సత్యనారాయణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు చేరని ప్రగతి రథచక్రం

- ఆసిఫాబాద్ నుంచి తిర్యాణి మండలానికి నిలిచిన బస్సు
- ఈ దారిలో కోతకు గురైన రోడ్డు
- వాహనదారులకు తప్పని తిప్పలు



భీంపూర్ వద్ద కోతకు గురైన రోడ్డు



తిర్యాణి: వర్షాకాలం వచ్చిందంటే చాలు మండలంలో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా వాహనాలు నడిచే పరిస్థితి ఉండకపోవడంతో కాలినడకన రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దీంతో ప్రజలు అత్యవసర సమయంలో నరకయాతన అనుభవిస్తున్నారు.

నిలిచిన బస్సు సర్వీసు..

జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రం వరకు వివిధ పనుల రీత్యా వందల సంఖ్యలో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సొంత వాహనాలు లేని వారు బస్సులో తిర్యాణి నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మండలంలోని మంగి, రోంపెల్లి గ్రామానికి వెళ్లే రెండు బస్సు సర్వీసులు ఇటీవల రద్దయ్యాయి. కురిసిన వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తిప్పలు పడుతున్నారు. ఈ దారిలో బైక్‌లు తప్ప, ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా ఉంది. కాగా, బస్సు సర్వీసు ద్వారా 30 కి.మీ ప్రయాణిస్తే జిల్లా కేంద్రానికి చేరుకునేది. ఇప్పుడు 60 నుంచి 80 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. బస్సు సర్వీసు తిరిగి ప్రారంభించడం ద్వారా దంతన్‌పెల్లి, భీంజిగూడ, పంగిడిమాదర, గిన్నెదరి, సుంగాపూర్, నాయకపుగూడ, రాళ్ళకన్నెపెల్లి, తలండి, తిర్యాణి, చెలిమల, మాణిక్యపూర్, రోంపెల్లి, మెస్రంగూడ, మంగి మారుమూల గ్రామాలకు రాకపోకలు సులభతరమవుతాయి. అయినప్పటికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు తలెత్తున్నాయి.

ఇబ్బందవుతోంది



అటు జిల్లా కేంద్రానికి, ఇటు మండల కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సర్వీసు నిలిచిపోయాయి. ఎటు వెళ్లాలన్నా ఇబ్బంది అవుతోంది. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో అత్యవసర సమయంలో ఇబ్బందిగా ఉంది.

– ఆత్రం భీంరావు, దంతన్‌పెల్లి, తిర్యాణి

వర్షాకాలం ముగిసిన తర్వాత ప్రారంభిస్తాం

జిల్లా కేంద్రం నుంచి తిర్యాణి వెళ్లేదారి బస్సు నడవడానికి అనుకూలంగా లేకపోవడంతో తాత్కాలికంగా బస్సు సర్వీసును నిలిపివేశాం. వర్షాకాలం ముగిసిన తర్వాత యథావిధిగా బస్సు సర్వీసును నడిపిస్తాం.

– శ్రీధర్, డీఎం

రోడ్డుపైనే పార్కింగ్.. ప్రజలు పరేషాన్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కాలనీ, చింతగూడ, కోయవాగు గ్రామాల నుంచి నిత్యం వందలాది ప్రజలు మెయిన్ మార్కెట్‌కు, రైల్వేస్టేషన్‌కు వివిధ పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఎస్పీఎం లారీలను నిలుపుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగినా ఎస్పీఎం యాజమాన్యం మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్పీఎం యాజమాన్యం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



రోడ్డుపై పార్కింగ్ చేసి ఉన్న లారీలు

చేతన సంస్థ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్య శాఖ ఆదేశాలతో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సహకారంతో చేతన సంస్థ ప్రతినిధులు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, బీపీ, షుగర్, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి అప్పటికప్పుడే రిపోర్టులు అందజేయనున్నట్లు చేతన పీఎం అధికారి సతీశ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌లో బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. చేతన సంస్థ ఔట్ రీచ్ వర్కర్లు సదా లక్ష్మి, క్రిష్ణ, సింధూజ, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

'కార్మికులను బెదిరించడం మానుకోవాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్‌అండ్‌టీ కంపెనీ యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని, సమ్మె చేస్తున్న కార్మికులపై ఉన్నతాధికారుల తొలగింపులు, బెదిరింపులు మానుకోవాలని జేఏసీ నాయకులు లోకేష్, దివాకర్, చిరంజీవి, రాజునాయక్, లింగయ్యలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 11వ రోజుకు చేరింది. నిరసనలో భాగంగా ధనోరా, మానిక్‌గూడ పంప్‌హౌజ్‌ల వద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కార్మికులు బాలేశ్, సురేశ్, వెంకటేష్, తాజ్, శ్రీకాంత్, అనిల్, రవీందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మిషన్ భగీరథ కార్మికులు

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

రెబ్బెన: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం డీవైఎఫ్ఐ మండల మొదటి మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్య, విద్యా ఉపాధి, వైద్యం, రోడ్డు, రవాణా సౌకర్యం కోసం పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. మండలంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా జాడి శ్యాం, ఉపాధ్యక్షులుగా చల్లూరి వంశీ, కార్తీక్, మండల కార్యదర్శిగా ఆత్మకూరి సతీష్, సహాయ కార్యదర్శులుగా చాపిడి పురుషోత్తం, చాపిడి శివ, తిరుపతి, సభ్యులుగా మహేశ్, శ్రీను, కృష్ణ, నీలేశ్‌ను ఎన్నుకున్నారు.

తిర్యాణి: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిసెల కార్తిక్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలు పురస్కరించుకొని మంగళవారం ఇంటింటికీ డీవైఎఫ్ఐ కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శులు రాజ్‌కుమార్, టీకానంద్, రాజేశ్వర్, పార్థు, పవన్ తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి

కాగజ్‌నగర్‌టౌన్: నాయీ బ్రాహ్మణ సంఘం బలోపేతం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోనేరు కృష్ణారావును సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కౌటాల: 104 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 104 ఉద్యోగులు కౌటాల పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో ఫార్మసిస్ట్ రాజేశ్, దేవాజీ ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అనుకోడ గ్రామం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అనుకోడ గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రమణ్‌కుమార్ తెలిపారు. సిర్పూర్(టి) మండలం పాతట్లగూడెం గ్రామానికి చెందిన సుద్దాల శంకర్ అనే వ్యక్తి వద్ద నుంచి 2 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు

గ్రామసభలు

తిర్యాణి: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ అన్నారు. మండలాన్ని నీతిఆయోగ్ గుర్తించడంతో అభివృద్ధి కార్యచరణ రూపొందించడం కోసం మొర్రిగూడ, గోయెగాం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేశ్వర్ ఉన్నారు.

శివాలయంలో ఎక్కాహం

బెజ్జూర్: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకొని జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు కొంద్ర జగ్గాగౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శివాలయంలో ఎక్కాహం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయంలో ప్రతీసారి భజన కార్యక్రమాలకు హాజరయ్యే నాగుల రాజమౌళి, శ్రీరామ సత్యనారాయణ, గోరంట్ల చంద్రమౌళిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్, నాగభూషణం గౌడ్, సురేశ్ గౌడ్, నరేందర్ గౌడ్, శ్యాంసుందర్, శంకర్, వెంకటేశం, సుధాకర్ గౌడ్, సుంకరి షణ్ముఖచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

15న గణేశ్ మండపాల నిర్వాహకుల సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఈ నెల 15న పట్టణ వ్యాప్తంగా ఏర్పాటు కానున్న గణేశ్ మండపాల ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి, భజరంగ్‌దళ్ పదాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నిర్వాహకులు హాజరై సలహాలు, సూచనలు చేయాలని కోరారు.

పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం ప్రారంభం

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ డీఈ కార్యాలయాన్ని మంగళవారం ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్‌లు ప్రారంభించారు. డీఈ రాజన్న, ఈఈ రామ్మోహన్ రావు, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, ఏఈ ఖాద్రీ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: మహిళలు ప్రభుత్వ వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ప్రారంభించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిద్ధార్థ్, డాక్టర్ నవత, సర్పంచ్ మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌తో ఫోన్‌ల రికవరీ

కాగజ్‌నగర్‌టౌన్: పోగొట్టుకున్న చోరీకి గురైన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నట్లు కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దే స్వామి తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన సునిత్ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా మంగళవారం ఫోన్‌ను అప్పగించారు.

రిటైర్డ్ పోస్ట్‌మ్యాన్ మృతి

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్ట్‌మ్యాన్ జాడి బాపురావు(66) మంగళవారం రాత్రి మృతి చెందారు. బాపురావు సాయంత్రం అకస్మాత్తుగా కుప్పకూలిపోగా వెంటనే వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లో బీపీ, ఆక్సిజన్ లెవల్స్ తగ్గడంతో ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: తమిళనాడు రాష్ట్రంలోని నమక్కల్‌లో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగే ఆర్మ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జాతీయ స్థాయిలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్)కి అనుబంధంగా ఉందన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

వాంకిడి: మండలంలోని ఖమాన ఉప ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెల్గి, సోయంగూడ గ్రామాల్లో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మనోహర్, హెచ్‌ఈవో రవిదాస్, హెచ్ఏ భగవాన్‌దాస్, పుష్ప పాల్గొన్నారు.

'పిల్లలకు పౌష్టికాహారం అందిస్తాం'

కాగజ్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీలు సమ్మె చేస్తుండటంతో పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పౌష్టికాహారం పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్ అన్నారు. ఈజ్‌గాం, రాస్పెల్లి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. ఐకేపీ సిబ్బంది సహకారంతో కేంద్రాలను నడిపించే చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

వాంకిడి: పాత పట్టా, పహాని ఉండి కొత్త పట్టా పాసుపుస్తకం రాని రైతులు సాగు చేసుకుంటున్న పంట వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాలని ఏవో మిలింద్ కుమార్ తెలిపారు.

'ఓటరు జాబితా'పై సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు రాజేశ్వర్, సురేశ్‌లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19 వరకు నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రాజకీయ పార్టీలు ఏజెంట్లను నియమించి, బూత్ స్థాయి అధికారులతో కలిసి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేలా కృషి చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జనాభా, లింగ నిష్పత్తి ప్రకారం ఓటరు నిష్పత్తి పెంచేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆదివాసీ అభ్యర్థులకే టికెట్ కేటాయించాలి

తిర్యాణి: ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం ఆసిఫాబాద్‌లో అన్ని పార్టీలు ఆదివాసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కొట్నాక గణపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జల్ -జంగల్ -జమీన్ కోసం ఈ గడ్డపై ఆదివాసీలు ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో 80వేలకు పైగా ఆదివాసీల ఓట్లు ఉన్నాయని, ప్రధాన పార్టీలు టికెట్లు కేటాయించకపోతే ఆదివాసీలంతా కలిసి ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతామన్నారు. సంఘం మండల అధ్యక్షుడు మడావి వెంకట్‌రావు, నాయకులు ఆత్రం చిత్రు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గణపతి

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



కెరమెరి: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు



దహెగాంలో సమ్మె చేస్తున్న కార్యకర్తలు

దహెగాం: న్యాయపరమైన డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వజ్రమ్మ, జయ, విజయలక్ష్మి, కల్పన, పద్మ, పార్వతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: అంగన్‌వాడీల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరవధిక సమ్మె నిర్వహించారు. అంగన్‌వాడీలకు రూ.5 లక్షలు, హెల్పర్లకు రూ.3 లక్షలు అందించాలని, కనీస వేతనం రూ. 26 వేలు, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్, అంగన్‌వాడీలు అనసూయ, గుణసుందరి, మంజుల, రాధా, హెల్పర్లు ఉన్నారు.

జైనూర్: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగామణి, కోశాధికారి కమలబాయి, మండల అధ్యక్షురాలు జంగుబాయి కార్యదర్శి తార, నీలాబాయి ఉన్నారు.

రెబ్బెన: అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సీఐటీయూ జిల్లా నాయకులు అంబాల ఓదెలు అన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకులు సత్తయ్య, అంగన్‌వాడీ సిబ్బంది రాజేశ్వరి, బాలమ్మ, చంద్రకళ, స్వర్ణలత, మంజుల, సుశీల, శ్యామలక్ష్మి, సంధ్య, భారతి పాల్గొన్నారు.

కౌటాల: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. రెండోరోజు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు చేపట్టిన సమ్మె కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, శ్యామల, మోక్ష, హేమవతి, ఇందు, ఆయాలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్: మహిళా సంఘాలు స్వయం సహాయక రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదిక వద్ద మంగళవారం 53 మహిళా సంఘాలకు రూ.3.26 కోట్ల శ్రీనిధి రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అనంతరం రూ. 5 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఏపీఎం శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మార స్వరూపరాణి, వీవో అధ్యక్షులు యశోద, మల్లేశ్వరి, సౌజన్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

విద్యతోనే మహిళలకు సాధికారత

వాంకిడి: మహిళలు విద్యతోనే సాధికారత సాధించగలుగుతారని మహిళా సాధికారత కేంద్రం సభ్యులు రాణి, సాగర్ సూచించారు. మంగళవారం మండలంలోని బెండార వద్ద గల మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహిళా సాధికారత కేంద్రం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు ఎలా అధిగమించాలి, ఎవరిని సంప్రదించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నంబర్లు, బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి పథకాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రాణి

'ఆదివాసీ సంప్రదాయాలు ఎంతో గొప్పవి'

జైనూర్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉన్నాయని సీసీడీ మేనేజర్ విఠల్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని రాసిమెట్ట గ్రామంలో ఇప్పపువ్వు చెట్లను గిరిజనులకు పంపిణీ చేశారు. ప్రజామిత్ర సిబ్బంది అశోక్, గ్రామస్తులు ఉన్నారు.